తలసేమియా వార్డును ప్రారంభించిన గవర్నర్

భద్రాచలం, అక్టోబర్ 25: పట్టణంలో రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా వార్డును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న 400 మంది వ్యాధిగ్రస్తులకు భద్రాచలంలో రూ.46లక్షలతో 20బెడ్లతో ఏర్పాటు చేసిన వార్డును ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, పీవో రాహుల్, ఎంపీ బలరామ్‌నాయక్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు ఎస్ఎల్ కాంతారావు పాల్గొన్నారు.

తలసేమియా వార్డును ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్‌కు బీజేపీ నాయకుల వినతి

బూర్గంపహాడ్, అక్టోబర్ 25: రాష్ట్ర విభజన సమయంలో వెంకటాపురం, వాజేడు మండలాలు ములుగు జిల్లాలో కలిపారని వాటిని భద్రాచలం నియోజకవర్గంలో కలపాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ విభజన సమయంలో ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలు (20 గ్రామాలు) పురుషోత్తపట్నం, గుండాల, ఎటపాక, పిచ్చుకలపాడు, కన్నాయిగూడేలను తిరిగి భద్రాచలం నియోజకవర్గంలో కలపాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, కుంజా ధర్మా, గుగులోత్ బాలునాయక్, బీరక సాయిశ్రీను, చక్రవర్తి, చుక్కపల్లి బాలాజీ ఉన్నారు.

పడిపోతున్న 'ప్రవేశాలు'!

అశ్వారావుపేట జీడీసీలో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి

మూడు గ్రూపుల్లోని 240 సీట్లకు చేరింది పది మందే..

ఒప్పంద పద్ధతిలో నలుగురు లెక్చరర్ల నియామకం

అశ్వారావుపేట, అక్టోబర్ 25 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడాదికేడాది అడ్మిషన్లు పడిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం.. సిబ్బందిని పూర్తి స్థాయిలో కేటాయించకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తుండడం కూడా ఒక కారణంగా తెలుస్తున్నది. అశ్వారావుపేటలో తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కృషితో గత కేసీఆర్ ప్రభుత్వం 2022లో డిగ్రీ కళాశాలను మంజూరు చేసింది. బీఏ, బీకాం, బీఎస్సీలో రెండు గ్రూపులకు కలిపి మొత్తం 240 సీట్లు కేటాయించింది. తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే 2023లో ఎన్నికల నేపథ్యంలో అడ్మిషన్ల గురించి ప్రచారం చేయకపోవడంతో అడ్మిషన్లు జరగలేదు. 2024-25 విద్యా సంవత్సరానికి 240 సీట్లకు.. కేవలం 11 మంది మాత్రమే అడ్మిషన్ తీసుకోగా.. వీరిలో ఒక విద్యార్థి పూర్తిగా మానేసింది. దీంతో 10 మంది మాత్రమే కళాశాలకు వస్తున్నారు. శుక్రవారం నలుగురు విద్యార్థినులు హాజరు కాగా.. వారికి గెస్ట్ లెక్చరర్ పాఠాలు బోధించారు. దీనిపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోపి మాట్లాడుతూ విద్యార్థులను మోటివేట్ చేస్తున్నామని, లెక్చరర్లను సమన్వయం చేసుకోవడం ద్వారా ఈ ఏడాది 11 మంది అడ్మిషన్ తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది అడ్మిషన్లు పెంచడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న లెక్చరర్

భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, అక్టోబర్ 25: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్య హోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

రామయ్యకు పట్టాభిషేకం...

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో రామయ్యకు పట్టాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. ప్రతి నెలలో పుష్యమి నక్షత్రం సందర్భంగా శ్రీరామపట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అదుపుతప్పిన ద్విచక్రవాహనం

ఘటనా స్థలంలో ఒకరు.. ఆసుపత్రిలో మరొకరు మృతి

దుమ్ముగూడెం, అక్టోబర్ 25: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన మండలంలోని ఆర్లగూడెంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనా స్థలంలో ఒకరు మృతిచెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొత్త నారాయణరావుపేట గ్రామానికి చెందిన పాయం జంపన్న(21), కొమరం వీర్రాజు(27)లు ద్విచక్రవాహనంపై లక్ష్మీనగరం వచ్చి పని చూసుకుని తిరిగి వెళ్తుండగా ఆర్లగూడెం శివారు మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. జంపన్న ఘటనా స్థలంలోనే మృతిచెందగా వీర్రాజుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. వీర్రాజు పరిస్థితి విషమించడంతో వైద్యులు కొత్తగూడెం తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించగా తీసుకువెళ్లే క్రమంలో ఆసుపత్రి వద్దే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. జంపన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం తరలించారు. మృతుడు జంపన్న తండ్రి పాయం రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గణేశ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొమరం వీర్రాజు(ఫైల్)

పాయం జంపన్న (ఫైల్)

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు హతం

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 25 : భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు హతమయ్యాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సుక్మా జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సుక్మా జిల్లా బుర్కలంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ భద్రతా దళాల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో కంగాల్‌తోగ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగడంతో భీకరపోరు సాగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే పారిపోయారు. అనంతరం భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం నుంచి ఎదురు కాల్పుల్లో మృతిచెందిన ఓ మావోయిస్టు మృతదేహంతో పాటు వారికి సంబంధించి ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం జవాన్లు చేసుకున్నారు.

ఇన్ఫార్మర్ నెపంతో గ్రామస్తుడి హత్య

పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ గ్రామస్తుడిని అతి దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుక్మా జిల్లా కొంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగరాజ్‌పాడు సమీపంలో గల ఆమపెంట గ్రామానికి చెందిన కొమరం గంగ అనే వ్యక్తిని మావోయిస్టులు అపహరించారు. అనంతరం ఉరి వేసి హత్య చేశారు. గంగ పోలీస్ ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో మావోయిస్టులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు.

15 టేకు దిమ్మెలు పట్టివేత

పర్ణశాల, అక్టోబర్ 25: దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధిలో చింతగుప్ప సెక్షన్ బోదనెల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం 15 టేకు దిమ్మెలు దుమ్ముగూడెం అటవీ శాఖ రేంజర్ కమల ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న టేకు దిమ్మెలను భద్రాచలం అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు.

దీపావళి బోనస్ విడుదల పట్ల సీఎండీకి కృతజ్ఞతలు

మణుగూరు టౌన్, అక్టోబర్ 25: సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ విడుదల చేయడం పట్ల సీఎండీ బలరాంకు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ ఏటా కార్మికుల శ్రమకు ప్రతిఫలంగా యాజమాన్యం అందించే ప్రొడక్షన్ లింక్డ్ రివార్డు దీపావళి బోనస్‌ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి సీఎండీ ఉత్తర్వులు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్మికులందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

పాల్వంచ/పాల్వంచ రూరల్, అక్టోబర్ 25: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి శుక్రవారం మండలంలోని విద్యాసంస్థల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు కిషోర్ సింగ్, కృష్ణ, వెంకటేశ్వర్లు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఎమ్మెల్సీ కోదండరామ్

భద్రాచలం, అక్టోబర్ 25: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనను ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు స్వాగతం పలికారు. ఆయన గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని ఉప ఆలయాలు లక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకోగా అర్చకులు పూజలు నిర్వహించి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. తొలుత జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వాకింగ్ చేసిన కోదండరామ్ అక్కడ వాకర్స్‌తో మాట్లాడారు.

ఐదు పంచాయతీలు తెలంగాణలో కలపాలి

భద్రాచలం, అక్టోబర్ 25: రాష్ట్ర విభజనలో తెలంగాణలోని భద్రాచలం నియోజకవర్గంలోని ఐదు పంచాయతీలను ఏపీలో కలిపారని, తిరిగి ఆ పంచాయతీలను భద్రాచలం నియోజకవరగలో కలపాలని భద్రాచలం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు కొత్తగూడెం ఆల్‌పెన్షనర్స్, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లగుళ్ల నాగేశ్వరరావు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. విభజనలో భద్రాచలానికి అన్యాయం జరిగిందన్నారు. పట్టణంలో అండర్ డ్రైనేజీ సిస్టమ్ కోసం సీఎం దృష్టికి సమస్య తీసుకువెళ్లి కృషిచేయాలని, కేంద్ర రైల్వేమంత్రికి కూడా పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు రైల్వేలైన్ విషయంపై మాట్లాడాలని కోరారు. దీనికి కోదండరామ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని, ఈ విషయం ముఖ్యమంత్రి, కేంద్ర రైల్వేమంత్రి దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థి విభజన సోషల్ మీడియా ఇన్‌చార్జి యువరాజు దళితబంధుపై వినతిపత్రం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

భద్రాచలం, అక్టోబర్ 25: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లుకు రూ.45 వేలు, రాముకు రూ.45 వేల చెక్కులు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, కృష్ణార్జునరావు, మట్టా శివాజీ పాల్గొన్నారు.

భద్రాచలం: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

చిన్నబండిరేవులో..

దుమ్ముగూడెం, అక్టోబర్ 25: మండలంలోని చిన్నబండిరేవు గ్రామానికి చెందిన బాధితుడు కాశిబోయిన ఉపేందర్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.60వేలు చెక్కును తెల్లం వెంకట్రావు బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కొమ్ము రంజిత్‌కుమార్, మట్టా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ తోట రమేశ్, గోనె సుధాకర్ పాల్గొన్నారు.

డంపుకు నిప్పు.. కంపుతో ముప్పు

ఇల్లెందు, అక్టోబర్ 25: ''డంపునకు నిప్పు పెడుతున్నారు. దాని నుంచి వస్తున్న కంపుతో మాకు ముప్పు ఏర్పడుతున్నది'' అంటూ, స్థానిక సింగరేణి నిర్వాసితుల కాలనీ వాసులు శుక్రవారం ఆందోళనకు దిగారు. డంపు వద్ద చెత్త వేసేందుకు వచ్చిన పారిశుధ్య సిబ్బందిని అడ్డుకున్నారు. ఇల్లెందు పట్టణంలో సేకరించిన చెత్తనంతా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా నిర్వాసితుల కాలనీ సమీపంలో డంప్ చేస్తున్నారు. ఈ చెత్తంతా గుట్టగా పెరిగినప్పుడు దానికి నిప్పు పెడుతున్నారు. ఇలా నిప్పు పెట్టినప్పుడల్లా పొగ, విష వాయువుతో కాలనీ వాసులు, సమీపంలోని లలితపురం గ్రామస్తులు శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. చెత్త డంపునకు పారిశుధ్య సిబ్బంది శుక్రవారం నిప్పు పెట్టారు. వారి వద్దకు బాధిత ప్రజలు వచ్చారు. నిప్పు పెట్టవద్దంటూ అడ్డుకున్నారు. డంపు-కంపుతో తాము ఎంతగా ఇబ్బందిపడుతున్నదీ వివరించారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. వారిపై బాధితులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇకపై చెత్తను వేయబోమంటూ హామీ ఇచ్చి, ఆ బాధితులను పంపించివేశారు.

కాలనీ సమీపంలో తగలబడుతున్న చెత్త

సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఎంపీ బలరాం నాయక్

పాల్వంచ, అక్టోబర్ 25: విద్యుత్, సింగరేణి సహా ప్రభుత్వ ఉద్యోగులందరి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. పాల్వంచలోని కేటీపీఎస్ 6వ దశ కర్మాగారం ఎస్ఈ కాటం సంజీవయ్య ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఎంపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. ఎమ్మెల్యే కూనంనేని, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, కేటీపీఎస్ సీఈలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల పల్లెలకు బీఎస్ఎన్ఎల్ సేవలు

టేకులపల్లి, అక్టోబర్ 25: మారుమూల పల్లెలకు కూడా బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని బీఎస్ఎన్ఎల్ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల కంట్రోలర్ అండ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ ఆఫీసర్(సీసీఏవో) ఎస్.తారాచంద్ అన్నారు. టేకులపల్లి పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సర్వీసెస్, మొబైల్ సిగ్నల్స్ పనితీరును తెలుసుకునేందుకు ఆయన శుక్రవారం వచ్చారు. బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరిచేందుకు, ప్రతి పల్లెకూ సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. బీఎస్ఎన్ఎల్ టవర్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో రవీందర్‌రావు, బీఎస్ఎన్ఎల్ అధికారులు బానోత్ సక్రునాయక్, సుధీర్, బాలాజీ, అశోక్, ఉదయ్, శివరాంజీ, పంచాయతీ కార్యదర్శి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న తారాచంద్, అధికారులు

రోడ్డు విస్తరణపై అధికారుల సర్వే

అశ్వారావుపేట, అక్టోబర్ 25: పట్టణంలో రోడ్డు విస్తరణపై డిస్కం, ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం సంయుక్తంగా సర్వే చేపట్టారు. స్థానిక జంగారెడ్డిగూడెం, భద్రాచలం, సత్తుపల్లి రోడ్డులోని విస్తరణ పనులను పరిశీలించారు. విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంభాలను లెక్కించారు. తొలగించాల్సిన, కొత్తగా వేయాల్సిన విద్యుత్ స్థంభాలను గుర్తించిన తర్వాత, ప్రతిపాదనలను ఆర్‌అండ్‌బీ అధికారులకు అందజేస్తామని డిస్కం ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్, ఏఈలు రామిశెట్టి శ్రీనివాసరావు, శెట్టిపల్లి కృష్ణార్జునరావు, డిస్కం ఏతఈ రవి పాల్గొన్నారు.

అయోడిన్ లోప రుగ్మతలపై అవగాహన

దుమ్ముగూడెం, అక్టోబర్ 25: మండల కేంద్రమైన లక్ష్మీనగరం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల వారోత్సవ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సులో వైద్యులు పుల్లారెడ్డి మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల యుక్తవయస్సు వారికి జ్ఞాపకశక్తి నశించడం, మానసిక అనిశ్చితి, శారీరక ఎదుగుదల లోపం బారిన పడతామన్నారు. పీహెచ్‌సీ వైద్యులు, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం దుర్గాదేవి, హెచ్ఎం సావిత్రి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

5న జంపాల, నీలం వర్ధంతి సభ

ఇల్లెందు, అక్టోబర్ 25: పీడీఎస్‌యూ నిర్మాతల్లో ఒకరైన జంపాల ప్రసాద్, నాయకులకు విప్లవ పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడు నీలం రామచంద్రయ్య వర్ధంతి సభను నవంబర్ 5న ఇల్లెందులో నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వి చెప్పారు. స్థానిక చంద్ర కృష్ణ మూర్తి ట్రస్ట్ భవన్‌లో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సభను విద్యార్థులంతా జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బానోత్ నరేందర్, మునిగల శివప్రశాంత్, పార్థ సారథి, గంగాధర గణేష్, హేమంత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ

టేకులపల్లి, అక్టోబర్ 25: ఉపాధి హామీ పథకం పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనులను ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

ప్రకృతి ఆశ్రమానికి మైక్ అందజేత

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 25: స్థానిక బస్టాండ్ సమీపంలో ప్రజాకవి జయరాజ్ నిర్వహిస్తున్న సింగరేణి సాహితి, సాంస్కృతిక, వికాస యోగా కేంద్రానికి సింగరేణి అధికారులు శుక్రవారం హ్యాండ్ మైక్ అందించారు. చంద్రమౌళి, గోవర్ధన్‌రావు, వీర్రాజు, శ్రీనివాస్, సుమన్ పాల్గొన్నారు. వారికి ఆశ్రమం కో-ఆర్డినేటర్ సుగుణారావు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టులు, టైలు, బ్యాడ్జీల పంపిణీ

టేకులపల్లి, అక్టోబర్ 25: మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొత్తగూడెం వాసవీ క్లబ్ బాధ్యులు శుక్రవారం బెల్టులు, టైలు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు గుబ్బా శ్యామ్‌గోపాల్, ప్రధాన కార్యదర్శి వల్లాల మణిదీప్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఫణీంద్రకుమార్, బొమ్మనపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్, బొమ్మనపల్లి హెచ్ఎం జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న మోడల్ మార్కెట్

ఇల్లెందు, అక్టోబర్ 25: పట్టణంలోని మోడల్ మార్కెట్ పనులు తుది దశకు చేరాయి. దీనిని పక్షం రోజుల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు చెప్పారు. నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రారంభమైన వెంటనే అర్హులందరికీ షాపులు కేటాయిస్తామన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ నందిత

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 25: మండలంలోని రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆర్‌బీఎస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నందిత బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించారు. గుమ్మడవల్లి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌బీఎస్‌కే బృందంలోని డాక్టర్ అఖిల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, పద్మావతి పాల్గొన్నారు.

మాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా మంద

జూలూరుపాడు, అక్టోబరు 25: మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జూలూరుపాడుకు చెందిన మంద రంజిత్‌కుమార్‌ను జాతీయ అధ్యక్షుడు జి.జెన్నయ్య నియమించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రంజిత్‌కుమార్‌కు నియామక పత్రాన్ని జెన్నయ్య అందించారు.

అయోడైజ్డ్ ఉప్పుపై అవగాహన

పాల్వంచ రూరల్, అక్టోబర్ 25: అయోడైజ్డ్ ఉప్పు ప్రాధాన్యంపై మండలంలోని జగన్నాథపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజు శుక్రవారం అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పోరాడతా'

రామవరం, అక్టోబర్ 25: కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం తాను పోరాడతానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం శుక్రవారం రుద్రంపూర్‌లో నిర్వహించిన మాట-ముచ్చట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను నాయకులు గూడెల్లి యాకయ్య, రాసూరి శంకర్ వివరించారు. కోదండరాం స్పందిస్తూ.. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం పోరాడతానని హామీ ఇచ్చారు.

రేపు సదర్ సమ్మేళనం

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 25: ఈ నెల 27న హైదరాబాద్ ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగే సదర్ సమ్మేళనాన్ని యాదవులంతా జయప్రదం చేయాలని జిల్లా యాదవ సంఘం నాయకు